www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 14 | జనవరి | 2026 పేజీలు : 8

## ఆయిల్ పాం సాగులో అగ్రస్థానంలో నిలవాలి



-సాగునీటి ఆకాంక్ష తీర్చాం
-పిల్లలను బాగా చదివించాలి
-సబ్ స్టేషన్, మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల

2లో

# సిపిఐ శతాబ్ది సంబురం.. సబ్బండ వర్గాల పండుగ



-బాగం హేమంతరావు
-కూరగాయల మార్కెట్‌లో బెలూన్లను ఎగురవేసిన సిపిఐ నాయకులు

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవ సంబురం సబ్బండ వర్గాల సంబురమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో అన్ని వర్గాల ప్రజల కోసం పోరాడింది సిపిఐ మాత్రమేనని అటువంటి సిపిఐ శతాబ్ది సంబురం ప్రజలందరి సంబురమని ఆయన తెలిపారు. మంగళవారం బైపాస్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ వద్ద సిపిఐ శతాబ్ది ముగింపు బహిరంగ సభ ప్రచారంలో భాగంగా ఎర్ర బెలూన్లను ఎగురవేశారు.

మిగతా 2లో..

## 18న సిపిఐ శతాబ్ది సభకు తరలిరండి

-రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలో ట్రాక్టర్ ర్యాలీ



ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 18న జరిగే ముగింపు సభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు రైతులను కోరారు. పార్టీ ఆవిర్భావం నుంచి రైతాంగ సమస్యలపై పోరాడిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం నగరంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ కార్యాలయం వద్ద గోవిందరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ బైపాస్ రోడ్డు, బస్ డిపో, మయూరిసెంటర్, వైరా రోడ్డు, జెడ్పి సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు, ఎన్‌టిఆర్ విగ్రహం, బైపాస్ మీదుగా పార్టీ కార్యాలయంకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో గోవిందరావు మాట్లాడుతూ భారతదేశ వ్యవసాయ రంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. రైతుల పోరాట ఫలితంగా నల్ల చట్టాలకు వెనక్కి తగ్గినట్లే తగ్గి

మిగతా 2లో..

## అరుణ వర్ణం పులుముకుంటున్న ఖమ్మం



-సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు ముస్తాబు
-గ్రామ గ్రామాన పండుగ వాతావరణం

2లో

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలి



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


2లో

## నేడు ఇంటింటిపై సిపిఐ జెండా




భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను పురస్కరించుకుని బుధవారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటిపై సిపిఐ జెండాను ఎగురవేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు అన్ని గ్రామాల్లో జెండాలు ఎగురవేయాలని ఆయన కోరారు.

-ప్రజాపక్షం/ఖమ్మం



# సిపిఐ శతాబ్ది సంబురం.. సబ్బండ వర్గాల పండుగ

(మొదటిపేజీ తరువాయి)

బెలూన్లకు సిపిఐ జెండాలు కట్టి గాలిలోకి వదిలారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేసిందన్నారు. పాలకులు ఎవరైనా ప్రజల పక్షాన ప్రశ్నించడమే లక్ష్యంగా సిపిఐ వందేళ్ల ప్రయాణం సాగిందన్నారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థి, యువజనులు, నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన కమ్యూనిస్టు పార్టీ బహుముఖ పోరాటాలు చేసిందని ఆయన తెలిపారు. ఈ పోరాట క్రమంలో అనేక మంది అమరులయ్యారని అమరుల త్యాగాలను శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మననం చేసుకోనున్నామని, వారి త్యాగాలను స్మరించుకుంటూ భవిష్యత్తు పోరాటాలకు పునరంకితం కానున్నామని హేమంతరావు తెలిపారు. అధికారం కోసం, సీట్ల కోసం, ఓట్ల కోసం కమ్యూనిస్టు పార్టీ పుట్టలేదని కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం సమసమాజమేనని ఆ లక్ష్య సాధనలో మరో వెయ్యేళ్లయినా కమ్యూనిస్టులు త్యాగాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని హేమంతరావు తెలిపారు. మా త్యాగాలు వృథా కాలేదని వందేళ్ల పోరాటంలో దున్నే వానికి భూమి దక్కిందని, బ్యాంకుల జాతీయ కరణ జరిగిందని, శ్రమ దోపిడీ నుంచి కార్మికులకు విముక్తి కలిగిందని, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రజల హక్కులను, స్వేచ్ఛను కాపాడగలిగామని ఆయన తెలిపారు. మళ్లీ మతోన్మాద శక్తులు ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని అందుకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు ప్రజలను సంసిద్ధులను చేసేందుకే శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 18న జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనవరి 18న జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, ఈ కార్యక్రమ బాధ్యులు మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లైమెంట్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, యానాలి సాంబశివ రెడ్డి, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా నాయకులు తాటి నిర్మల, నూనె శశిధర్, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# 18న సిపిఐ శతాబ్ది సభకు తరలిరండి

(మొదటిపేజీ తరువాయి)



దొడ్డిదారిన ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. వ్యవసాయ రంగ పరిరక్షణకు, రైతాంగ శ్రేయస్సుకు పోరాడిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను ఖమ్మంలో జరుపుకుంటుందని ఈ సందర్భంగా రైతుల ప్రత్యేక ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనలో రైతు వేషధారణలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనాలని గోవిందరావు విజ్ఞప్తి చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగ పరిరక్షణ కమ్యూనిస్టు పార్టీ పోరాటాలతోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఈ బహిరంగ సభకు విదేశీ ప్రతినిధులు, సిపిఐ జాతీయ నాయకులతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రాంకోటి, బాగం ప్రసాద్, ఏలూరి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అరుణ వర్ణం పులుముకుంటున్న ఖమ్మం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** సంక్రాంతి పండుగతో పాటు ఖమ్మం జిల్లాలో జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ కొత్తశోభను తీసుకు వచ్చింది. ఈనెల 18న జరగనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను పురస్కరించుకుని ఖమ్మం నగరాన్ని తోరణాలతో అలంకరిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన కూడళ్లను ఎర్ర తోరణాలతో అందంగా అలంకరించారు. నగరంలోని వైరా రోడ్డు, బైపాస్ రోడ్డు, గాంధీచౌక్, ఇల్లందు క్రాస్ రోడ్డు, ఇల్లందు రోడ్డు, జెడ్పి సెంటర్, ముస్తఫానగర్, రోటరీ నగర్ తదితర ప్రాంతాలలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నగరంలో ఎటు చూసినా అరుణ పతాక రెప రెపలే కనిపిస్తున్నాయి. మరో పక్క ప్రదర్శనలో పాల్గొనే ప్రతి కార్యకర్త చేతిలో జెండా ఉండేవిధంగా 50 వేల జెండాలను వారం రోజులుగా సిపిఐ కార్యకర్తలు సిద్ధం చేస్తున్నారు. బహిరంగ సభకు హాజరయ్యే సిపిఐ జాతీయ నాయకులు రాష్ట్ర బాధ్యులకు స్వాగతం తెలుపుతూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానుండడంతో రేవంత్‌రెడ్డి ప్రత్యేక స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు పార్టీ ప్రారంభం నుండి పనిచేసి ప్రజా పోరాటాల్లోనూ, ప్రభుత్వ నిర్బంధంల్లోనూ ప్రత్యర్థుల చేతుల్లోనూ ప్రాణాలు కోల్పోయిన సిపిఐ అమరుల పేరిట ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలోని చారిత్రిక ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేవిధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నిర్బంధాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల చిహ్నంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. ఖమ్మం నగరంతో పాటు పల్లె పల్లెకు సిపిఐ శతాబ్ది ఉత్సవ సంబురం పాకింది. కమ్యూనిస్టు పార్టీ ఉన్న ప్రతి గ్రామంలోనూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గడిచిన 15 రోజులుగా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ జయప్రదం కోరుతూ గ్రామ గ్రామాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పల్లెల్లో పండుగ శోభతో పాటు సిపిఐ శతాబ్ది ఉత్సవ సంబురం కూడా చర్చనీయాంశమైంది. ఈ నెల 14న బుధవారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇంటింటిపై అరుణ పతాకాలను ఆవిష్కరించనున్నారు. వాహనాల ఏర్పాటు, ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాల హడావుడిలో పార్టీ కార్యాలయాల్లో తిరునాళ్ల హడావుడి కనిపిస్తుంది. ఇప్పటికే పల్లెలు అరుణ వర్ణాన్ని పులుముకుంటున్నాయి. గత ప్రచార పద్ధతులను పాటిస్తూనే మారిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని డిజిటల్ ప్రచారానికి సైతం తెర లేపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆండ్రాయిడ్ సెల్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్కరికి మహాసభల సందేశాన్ని చేరవేస్తున్నారు.

# ఆయిల్ పాం సాగులో అగ్రస్థానంలో నిలవాలి





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** జిల్లా అభివృద్ధితో పాటు రాష్ట్ర రైతాంగానికి అండగా ఉంటూ పలు కార్యక్రమాలను చేపడుతున్నామని మూడేళ్లలో ఆయిల్ పాం సాగులో తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్, మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం మంచుకొండలో ప్రాజెక్టు నీటి డెలివరీ సిస్టం వద్ద పూలతో కృష్ణా నీటికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతేడాది ఇదే రోజు మంచుకొండ ఎత్తిపోల పథకానికి శంకుస్థాపన చేశామని హామీ ఇచ్చిన మేరకు ఏడాది నాటికి సాగునీటిని విడుదల చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ ల సహకారంతో లిఫ్ట్ పనులు సకాలంలో పూర్తి చేశామన్నారు. రఘునాథపాలెం మండలంలో అధికంగా గిరిజనులు, చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని నాగార్జున సాగర్ ఎడమ కాలువపై లిఫ్ట్ ఏర్పాటు చేసి కృష్ణా జలాల ద్వారా సాగునీటి ఆకాంక్షను తీర్చామన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 300 లిఫ్ట్‌లు ఏర్పాటు చేశామన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసుకుంటే గోదావరి జలాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. బుగ్గవాగు ప్రాజెక్టు పనులు పూర్తి చేసి గ్రావిటి ద్వారా మండలంలోని చెరువులను నింపుతామన్నారు. కృష్ణాజలాలు, బుగ్గవాగు జలాలు, వర్షాధార నీళ్ళు, సీతారామ ప్రాజెక్టు ద్వారా మండలానికి నీళ్లు వస్తాయన్నారు. ఖమ్మం అర్బన్ ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రత్యేకంగా రఘునాథపాలెం కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఎంపిడివో, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలోనే యంగ్ ఇండియా స్కూల్, స్వామినారాయణ్ పాఠశాల, వైద్య కళాశాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాజమండ్రి, నాగపూర్, అమరావతి, హైదరాబాద్ ఎక్కడికి వెళ్లాలన్న రఘునాథపాలెం మండలం చుట్టు పక్కల ఉన్న జాతీయ రహదారుల మాత్రమే వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వచ్చే ఏడాది నాటికి సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని చెరువులను గోదావరి జలాలతో నింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు,మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఖమ్మం ఆర్డివో నర్సింహారావు, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ శాలువలతో సన్మానించారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు సత్తుపల్లిలోని రాణి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మె ల్యే మట్టా రాగమయిదయానంద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా మంత్రి శ్రీనివాసరెడ్డి,ఎంపి రామసహాయం రఘురామరెడ్డిలు పాల్గొన్నారు. గెలుపొందిన ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి జ్ఞాపికలతో పాటు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల వల్లే సర్పంచ్‌లు విజయం సాధించారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపుతో మీపై బాధ్యత మరింత పెరిగిందని, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రధాన బాధ్యతని, అవసరమైన ప్రతి సహాయానికి తాము సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ మట్టా దంపతులు కష్టపడి సర్పంచ్ అభ్యర్థులను గెలిపించారని ప్రశంసించారు. వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాగమయి, దయానంద్‌లు ప్రతి గ్రామం తిరగడం వల్ల అద్భుత ఫలితాలు వచ్చాయని, 69 శాతం విజయాలు సాధించామని చెప్పారు. కార్యకర్తల కష్టం చెమట, రక్తంగా మారి ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచారని అన్నారు. కొన్ని చిన్న సమస్యల కారణంగా కొద్ది స్థానాల్లో ఓటమి ఎదురైందని, ఇకపై బీ ఫామ్ విధానంతో అలాంటి సమస్యలు ఉండవని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బలమైన మద్దతు ఇచ్చారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మరింత శాతం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమిదని, స్వార్థం కోసం కాదని స్పష్టం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.పంచాయతీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లుగా ప్రజలు మీపై నమ్మకం ఉంచి గెలిపించారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, గ్రామాల్లో ప్రజాభిమానం పొందేలా తప్పులు చేయకుండా అభివృద్ధికి పాటుపడాలని మంత్రి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోమ ఆనంద్, భాగం నీరజా చౌదరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు శివ వేణు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ తోట సుజల రాణి, సర్పంచులు భీమిరెడ్డి అరుణ, నరుకుళ్ళ రాజేశ్వరి, పొట్ట బాబురావు, తాటి ఈశ్వరి, నాగేంద్ర, ఒంటెద్దు వెంకటమ్మ, కాకర్ల రేవతి, చాట్ల దుర్గ, అయినంపూడి శ్రీనివాసరావు , ఉపసర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చలగుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, గ్రాండ్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# సిరిపురంలో సెంటర్ లైటింగ్ ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం కెజి సిరిపురం గ్రామంలో సెంటర్ లైటింగ్‌ని సోమవారం రాత్రి గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో ఎన్నో రోజులుగా స్థానిక సెంటర్‌లో సరియైన లైటింగ్ లేక గ్రామస్థులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది గమనించిన సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాస్ ఉన్నతాధికారులతో నాయకులతో చర్చించి గ్రామంలో సెంటర్ లైటింగ్‌ని ఏర్పాటు చేపించారు. అనంతరం స్థానిక సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి సెంట్రల్ లైటింగ్ ప్రారంభించారు. ముమ్మందు రోజుల్లో గ్రామం అభివృద్ధి చెందేలా నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుష్పావతి, మోరంపూడి మధు, పరుచూరి రామారావు, మోరంపూడి బాబు, దరిపల్లి నారాయణ, కాటమ్మ, నారపోగు వెంకటి, అయినాల కనకరత్నం, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాల విడుదల

**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండా గ్రామ పంచాయితీ మల్టీ పర్పస్ కార్మికులకు జీతాలు విడుదల కాగా, 8 మంది కార్మికులకు గాను 9500రూపాయల చొప్పున 76000రూపాయల చెక్కును సర్పంచ్ హీరాలాల్ కార్మికులకు అందజేశారు. పెండింగ్ జీతాలను సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం విడుదల చేయడం, వారికీ జీతాల చెల్లింపులతో వారి కుటుంబాలు ఆనందంతో సంతోషంగా పండుగ చేసుకుంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోత్ భిక్కులాల్, వార్డు సభ్యులు వాంకుడోత్ గాంధీ, మాజీ ఎంపిటిసి సభ్యులు బానోత్ రాంచందర్, గౌస్ పాషా, పంచాయితీ కార్యదర్శి పి అనిల్‌కుమార్, పంచాయితీ సిబ్బంది హేంచంద్, రాందాస్, గణేష్, రమేష్, చరణ్, రాధా, నంద, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు జీవిత భవిష్యత్తును నిర్ధేశిస్తాయి..



**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**- సిపిఐ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** విద్య ఏ విధంగానైతే భవిష్యత్తుకు బాటలు వేస్తుందో క్రీడలు సైతం ఆ సరనసనే నిలుస్తాయని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని తాళ్లేసితండలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పాలేరుని యోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడలతో ఏర్పడిన స్నేహాలను జీవితంలో మంచి వైను ప్రయాణం చేసేలా వినియోగించుకోవాలన్నారు. అంతేకానీ ఘర్షణల వైపు పోకుండా స్పోర్టీవ్‌గా తీసుకొని పోరాట పటిమను చూపించాలన్నారు. గ్రామీణ స్థాయి నుంచి కనబరిచే ప్రతిభ రాష్ట్ర, దేశ స్థాయికి తీసుకువెలుతుందన్నారు. అలాగే టోర్నమెంట్ ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు మొహ్మద్ గౌస్‌పాషా, శాఖ సెక్రటరీ ధరావత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శత వసంతాల సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఖమ్మంలో జనవరి 18న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు చింతల రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం రఘునాథపాలెం మండల కేంద్రంలో శత వసంతాల సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల రమేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో ఈనెల 18న జరిగే బహిరంగ సభ ఓ మైలురాయిగా నిలవనుందన్నారు. వందేళ్ల కాలంలో అనేక పోరాటాలు సాగించిందని భూమి కోసం భుక్తి కోసం ఉద్యమాలను నిర్వహించిందన్నారు. ఉద్యమ ఖిల్లా అయిన ఖమ్మంలో శత వసంతాల ముగింపు సభ జరగడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సభకు భారీ సంఖ్యలో మండలం నుంచి తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిమ్మపుడి ఉప సర్పంచ్ జూల వెంకటేశ్వర్లు, నాయకులు బోడా చిన్న, బానోత్ నాగేశ్వరరావు, గుగులోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి..



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలని, క్రీడల ద్వారా మానసికోల్లాసం, శారీరక దృఢత్వం నూతన పరిచయాలతో స్నేహభావం పెరుగుతాయని మండల కాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్ అన్నారు. మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామంలో యువకులు క్రీడలుపై చూపిస్తున్న ఆసక్తిని గ్రహించి పోట్ల కిరణ్ తనయుడు అమ్మ కన్స్ట్రక్షన్ అందినేత పోట్ల సురేష్ యువకులను సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ కిట్టును అందించారు. ఈ సందర్భంగా పోట్ల కిరణ్, సురేష్ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు బానిసవ్వకుండా క్రీడలపై ఆసక్తి చూపటం ద్వారా మానసిక ఉల్లాంతో పాటు శారీర దృఢత్వం యువకుల్లో నూతన పరిచయాలతో స్నేహభావం పెరుగుతాయని అన్నారు. క్రికెట్ పోటీల్లో మంచి నైపుణ్యం సాధించి మండల జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొనాలని, జల్లేపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ తేజావత్ ఉపేందర్, గ్రామ యువకులు తరుక వేణు, రమేష్, హరీష్, దిలీప్, గోపి, ప్రణయ్, రమేష్, ప్రవీణ్, వెంకన్న, రఘు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే బిఆర్ఎస్ అసత్య ప్రచారం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీలో త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, మున్సిపాల్టీ ఎన్నికల్లో భయపడాల్సింది కాంగ్రెస్ పార్టీ కాదని బిఆర్ఎస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణగుప్తా అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మధిరను అభివృద్ధి చేసిందని ఏమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామో బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న భట్టివిక్రమార్క కృషితోనే చేసిన అభివృద్ధిని బిఆర్ఎస్ పార్టీ వారు తాము చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. డిప్యూటీసిఎంగా మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గాన్ని రెండేళ్లలో కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి మధిరను మోడల్ సిటిగా మార్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎంపి నామ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని, త్వరలో జరుగనున్న మున్సిపాల్టీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయటం ఖాయమని, కాంగ్రెస్ చేసిన అభివృద్ధే మధిర మున్సిపాల్టీ ప్రజలు ఆదరించి పట్టం కడుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్‌రెడ్డి, మండల ఐఎన్‌టీయుసి అధ్యక్షులు కోరంపల్లి చంటి, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.జహంగీర్, డివిజన్ కమిటీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, మాగం ప్రసాద్, కోట నాగరాజు, అల్లాడి గోపాలరావు, కర్నాటి రామారావు, ఆవుల కిరణ్, పత్తేపరపు సంగయ్య, తన్నీరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం హెలిప్యాడ్ స్థలం పరిశీలన

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లి మార్కె ట్ యార్డులో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి హెలిప్యాడ్ స్థలాన్ని మంగళవారం అధికారులు పరశీలించారు. ఈ నెల 18న పాలేరునియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవలో చేయనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో సిపి సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డీఓ నర్సింహారావు, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్‌బీ సిఐ రాజిరెడ్డి, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, మార్కెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 18న వందేళ్ల సిపిఐ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** భూమి కోసం భుక్తి కోసం సమసమాజ స్థాపనకోసం సుదీర్ఘ పోరాటాలద్వారా ప్రజలకు ఫలాలు అందించిన సిపిఐ ఈనెల 18న ఖమ్మంలో వందేళ్ల సిపిఐ చారిత్రక సభ జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సబ్యులు దొండపాటి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం ఉప్పలచలక గ్రామంలో జరిగిన సిపిఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం ఉపాధి అవకాశాలు కూలిపోయి పేదప్రజలు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రచారాలే ప్రాణాపాయమని భావించి పరిపాలన సాగించడం దురదృష్టకరమని అన్నారు. రైతులు గిరిజనులు మహిళలు విద్యార్థులు యువతీయువకులు కార్మికులు పెద్ద ఎత్తున కదిలి జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ సభకు కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు బాణోత్ భరత్, తోటపల్లి సీతారాములు, గుగులోత్ రమేష్, భూక్యా సక్రు, భద్ర, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.


# యూరియా కేంద్రం ప్రారంభం





**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల సౌలభ్యం కోసం నేరడ గ్రామంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిఈవో మారగాని శ్రీనివాసరావు, ఏవో , జీపీవో వెంకటేష్ , ఉపసర్పంచ్ కోట బాలేష్, వార్డు సభ్యులు, రైతులు నున్న వీరయ్య, మేడ బాబు, ఆలశ్యం వెంకయ్య, గోవిందరావు, రాగం లింగబాబు పాల్గొన్నారు.

# సిపిఎం సీనియర్ నేత కట్టా గాంధీ మృతి



**ప్రజాపక్షం/ మధిర :** సిపిఎం పార్టీ మధిర పట్టణ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన కమ్యూనిస్టు యోధుడు, మాజీ కౌన్సిలర్ కట్టా గాంధీ మంగళవారం మృతి చెందారు. కట్టా గాంధీ మృతి వార్త తెలుసుకున్న ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ లోక్ సభాపక్షనేత నామ నాగేశ్వరరావు ద్రిగ్భాంతికి లోనై ఫోన్‌లో మాట్లాడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు యోధుడిగా గాంధీ ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని, భౌతికంగా మన మధ్య లేకపోయినా మధిర ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని కొనియాడారు. మధిర రాజకీయాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. నిత్యం బడుగు బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన మంచి ప్రజా నాయకుడ్ని కోల్పోవడం బాధాకరమన్నారు. సిపిఎం జిల్లా, మండల నేతలు, పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీ నాయకులు, అభిమానులు, ఇతర సంఘాల నాయకులు తదితరులు కల్లూరు మండలం పోచవరం గ్రామంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జమలాపురంలో ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఖమ్మం కేఎన్ఆర్ గ్రానైట్స్ ఇండ స్ట్రీస్ వారి ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, సర్పంచ్ నిర్మల కుమారి తెలిపారు. గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం సన్నిధిలోని శ్రీ వకుళామాత స్టేడియం వద్ద మధ్యాహ్నం 2గంటల నుండి ఈ ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేయటం జరుగుతుందని, ఆసక్తిగల మహిళలు ఈ పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు. మొదటి బహుమతిగా రూ.10వేలు విలువ చేసే గ్రైండర్, రెండవ బహుమతిగా మిక్సర్ గ్రైండర్, మూడవ బహుమతి రైస్ కూకర్‌తో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కన్సొలేషన్ బహుమతులుఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారుముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9949767114, 99899973264 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గల పోటీలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని తెల్దారుపల్లిలో ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఖమ్మం జిల్లా కార్యదర్శి బండి పద్మ, జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, తమ్మినేని కమలమ్మ, పాలేరుడివిజన్ కార్యదర్శి పెండ్యాల సుమతి, నాయకురాల్లు పెండ్యాల సుమతి, పోతురాజు సావిత్ర నూర్జహాన్, సరస్వతి, సైదమ్మ, ఉమా, ఉష తదితరులు పాల్గొన్నారు.

## 18న జరిగే సిపిఐ శత వసంతాల సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖమ్మంలో ఈనెల 18న జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100వ శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని వివిధ ఆటో అడ్డాల వద్ద బహిరంగ సభ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు రైతులు పేద వర్గాల సమస్యల కోసం వందేళ్లుగా పోరాడుతున్న సీపీఐ శతజయంతి సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. 45 దేశాల ప్రతినిధులు, జాతీయ నాయ కత్వం హాజరవుతున్న నేపథ్యంలో కార్మిక లోకం పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి అడ్డా అధ్యక్షులు చిల్లగొండ్ల కాశీ రావు, ప్రసాద్ సింగ్, పర్సా వెంకన్న, తడికమళ్ళ హరిబాబు, సూరిబాబు, గరికంటి అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి లేఖల అందజేత



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యుత్ వినియోగదారులకు, అధికారులు, సిబ్బందికి మధ్య సత్సంభంధాలు ఉండాలని పాల్వంచ విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ నందయ్య అన్నారు. ఉచిత విద్యుత్ గృహజ్యోతి, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు సంక్రాంతి పండుగ సంధర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన లేఖలను కొత్తగూడెం కార్పోరేషన్ పాల్వంచ డివిజన్ పరిధి, గ్రామీణ ప్రాంతాలలో మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన వక్తృత్వ పోటీలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో మండల దశాబ్ది ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలు సందర్భంగా హరి హర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ అంకమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో విద్యార్ధిని, విద్యార్ధులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ లాకవత్ లక్ష్మి హాజరయ్యారు. అధ్యక్షులుగా మారగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్ధులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఈనెల 16వ తేదీన విజేతలకు పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మారగాని అశోక్, మాజీ ఎంపిటిసి కృష్ణారెడ్డి, వార్డు మెంబర్లు మడి సూర్యం, పానుగంటి రాఘవులు, నిర్వాహకులు ఉపాధ్యాయులు చల్ల భాస్కరరావు, పరసా వెంకటేశ్వర్లు, ఇనుపనూరి రాంబాబు, పెద్దలు గౌండ్ల పుల్లారావు, జవ్వాజి భద్రం, గ్రామ ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంగళరావు ప్రాజెక్ట్ అలుగు నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్ట్ అయినటువంటి వెంగళరావు ప్రాజెక్ట్ అలుగు నిర్మాణ పనులను సాగునీటి పారుదల క్వాలిటీ కంట్రోల్ అధికారులు డిఈ రమేష్, ఏఈ నరేష్‌లు మంగళవారం పరిశీలించారు. ప్రధానంగా అలుగు నిర్మాణ పనులు నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని సాగునీటి పారుదల ఇంజనీర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ ఏడాది జూన్ 2026 నాటికి ప్రాజెక్ట్ అలుగు నిర్మాణం పూర్తి చేసి, రైతులకు సాగునీరు ఇచ్చేందుకు అధికారులు పని చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఈ కృష్ణ, ఏఈ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ అన్నారు. మంగళవారం రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎరైవ్..ఎలైవ్ 2026లో భాగంగా బూర్గంపాడు గ్రామ పంచాయితీ నందు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, గోల్డెన్ అవర్, డిఫెన్సివ్, డ్రైవింగ్ నియమాల గురించి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు, ఇతరులు భద్రతకు కూడా సహకరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండె వెంకన్న, గ్రామ పెద్దలు, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**- రూ.15కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాల్టీలో పట్టణాభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అశ్వారావుపేట మున్సిపాల్టీలో రూ.15కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంగళవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోందన్నారు. పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మౌలిక వసతుల అభివృద్ధి ప్రాధాన్యతలో భాగంగా అశ్వారావుపేటలో అంతర్గత రహదారుల విస్తరణ, సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజి వ్యవస్థ ఆధునీకరణ, తాగునీటి సరఫరా తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని మంత్రి వివరించారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు మరింత సౌకర్యవంతమైన జీవనం లభిస్తుందని పేర్కొన్నారు.

**సమన్వయంతో అభివృద్ధి : ఎంపి రామసహాయం**

ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అశ్వారావుపేట ప్రాంతానికి అవసరమైన అదనపు నిధులు, అభివృద్ధి పథకాలు తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే అభివృద్ధి పనులే ప్రభుత్వ విజయానికి కొలమానం అని అన్నారు.

**ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నాం : ఎమ్మెల్యే జారే**

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చి ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అశ్వారావుపేట మున్సిపాల్టీ అభివృద్ధికి గతంలో ఎన్నడూలేనంతగా నిధులు మంజూరు చేయించామని తెలిపారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తామని తెలిపారు.

**అధికార పార్టీ సర్పంచ్‌లకు ఘన సన్మానం...**

ఈ సందర్భంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన అధికార పార్టీ సర్పంచ్‌లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందచేసి ఘనంగా సన్మానించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, మండల అధ్యక్షులు తుమ్మ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్‌బాబు, బత్తుల అంజి, బొజ్జ నాయక్ పరుష వెంకట్, కోల లక్ష్మీనారాయణ, ప్రమోద్, రమేష్, సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను చెరబడుతున్న అక్రమ చేపల వ్యాపారం..!

**ప్రజారోగ్యంపై మౌన దాడి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పచ్చని పల్లెలకు ప్రాణవాయువుల్లాంటి చెరువులు నేడు విషపు కుంటలుగా మారుతున్నాయి. చేపల పెంపకం పేరుతో సాగుతున్న అక్రమ ధనార్జన ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, గ్రామీణ జీవన విధానాన్ని ఒకే సారి నాశనం చేస్తోంది. లాభమే లక్ష్యంగా సాగుతున్న ఈ వ్యాపారం వెనుక దాగి ఉన్న భయంకర వాస్తవాలు ఇప్పుడు బయటపడుతున్నాయి.

**ఆంధ్రాలో ఆరంభం తెలంగాణకు విస్తరణ...**

ఆంధ్రప్రదేశ్‌లో పత్రికా కథనాలు, ప్రజా ఉద్యమాల నేపథ్యంలో అక్కడి ప్రభుత్వాలు అక్రమ చేపల పెంపకంపై కఠిన చర్యలు చేపట్టాయి. నిబంధనలను తట్టుకోలేని వ్యాపారులు రూటు మార్చారు. లక్ష్యంపర్యవేక్షణ తక్కువగా ఉన్న ప్రాంతాలు తెలంగాణలోని ఆంధ్ర సరిహద్దు మండలాలైన కల్లూరు, వేంసూరు, మధిర, సత్తుపల్లి వంటి ప్రాంతాల్లో చెరువులను లీజుకు తీసుకుని అక్రమ చేపల పెంపకం జోరందుకుంది. ఈ వ్యాపారులు గతంలో ఆంధ్రప్రదేశ్లో ఉపయోగించిన అదే పద్ధతులను ఇక్కడ అమలు చేస్తున్నారు. తక్కువ ఖర్చు, ఎక్కువ లాభం, ప్రజల ప్రాణాలపై కనీస లెక్కలేకుండా.

**చేపల మేతగా విషమేనా..?**

చేపలకు ఇవ్వాల్సిన సమతుల్య ఆహారం (ఫీడ్) ఖరీదైనదనే కారణంతో, చనిపోయిన కోళ్లు, కోళ్ల వ్యర్థాలు, జంతు కళేబరాలను మేతగా వినియోగించడం బహిరంగ రహస్యంగా మారింది. ఇవి కుళ్లిపోయి నీటిలో కలిసే సరికినీటిలో అమోనియా, బ్యాక్టీరియా స్థాయిలు పెరుగుతాయి. చెరువుల నీరు దుర్వాసనతో నిండిపోతుంది. చేపల్లో వ్యాధులు ప్రబలుతాయి. ఆ వ్యాధిగ్రస్త చేపలే మన కంచాల్లోకి చేరుతాయి. ఇది కేవలం ఆహార భద్రత సమస్య కాదుఇది ప్రజారోగ్యంపై మౌన దాడి.

**చెరువుల కన్నీళ్లు - పల్లెల గుండెచప్పుడు...**

నిన్న మొన్నటి వరకు స్వచ్ఛంగా ఉన్న చెరువులు నేడు కలుషితమై ఊపిరాడని స్థితికి చేరాయి. చెరువు చుట్టూ నివసించే ప్రజలకు చర్మవ్యాధులు, జీర్ణాశయ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు పెరుగుతున్నాయి. నీటితో పాటు భూమి కూడా విషపూరితమవుతోంది. వ్యవసాయానికి ఉపయోగించే నీరు కలుషితమైతే పంటలు, పశువులు అన్నీ ప్రభావితమవుతాయి.

**పాలకుల వైఫల్యమా..?, పర్యవేక్షణ లోపమా..?**

చేపల పెంపకానికి స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ లీజుల మంజూరులో పారదర్శకత లోపిస్తోందిఫుడ్ సేఫ్టీ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మధ్య సమన్వయం లేదు. క్షేత్రస్థాయి తనిఖీలు అరుదుప్రజల ఫిర్యాదులు పట్టించుకోని పరిస్థితి. ఈ క్రమంలోనే అక్రమ వ్యాపారులు పాతుకుపోతున్నారు. తక్షణమే చెరువులను తనిఖీలు చేసి, మేత నమూనాల సేకరణ, నీటి నాణ్యత పరీక్షలు లీజు రద్దు , క్రిమినల్ కేసులు, అక్రమాలకు పాల్పడితే తక్షణ చర్యలుఇంటర్‌స్టేట్ కోఆర్డినేషన్ సరిహద్దు మండలాల్లో సంయుక్త దాడులు చేయటంతో పాటుప్రజలకు అవగాహన కల్పించాలి. వ్యాధిగ్రస్త చేపల ప్రమాదాలపై గ్రామ స్థాయి ప్రచారం చేయాలి, శాస్త్రీయ, పర్యావరణ హిత చేపల పెంపకానికి ప్రోత్సాహం కల్పించాలి.

## గుత్తేదారు మాయాజాలం.. అంతా ఆయన చేతుల్లోనే..!

**-పగిలిన డ్రైనేజీ బిళ్ళలు**
**-చెదిరిపోతున్న సెంట్రల్ లైటింగ్ దిమ్మెలు**
**-రోడ్డు కంటే ఎత్తుగా డ్రైనేజీలు**
**-వర్షాకాలంలో చూడాలి వీరి నాణ్యత పనులు**
**-తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా అధికారుల తీరు**









**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రజల సొమ్ముతో జరుగుతున్న అభివృద్ధి పనుల వెనక దాగిన అవినీతి బయటపడుతోంది. అశ్వాపురంలోని మణుగూరు, కొత్తగూడెం ప్రధాన రహదారి వెంట నిర్మిస్తున్న రోడ్డు పనులు ప్రజలకు ఉపయోగపడాల్సి ఉండాలి కానీ వారికీ ఈ నిర్మాణం శాపంగా మారాయి. రోడ్డు ఇరువైపులా ఎక్కడ చూసినా పగిలిపోయిన డ్రైనేజీ బిళ్ళలు ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన దిమ్మె అంచులు కూలిపోతూ పెద్ద పెద్ద వాహనాలు ప్రయాణంలో దిమ్మెలకు తగిలిన సందర్భాలు ఉన్నాయి. వాహనదారులను భయాందోళన కలిగిస్తున్నాయి. అసలు రోడ్డు నిర్మాణ సమయంలో సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు అంటే గుత్తేదారు నిర్లక్ష్యం ఎంతుందో చెప్పవచ్చు. రోడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో డ్రైనేజీ నీరు రోడ్డుపైనే నిలిచిపోయ్యే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో వాన కురిస్తే ఆ నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక రోడ్డు మొత్తంగా చెరువును తలపిస్తుందని, ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు. డ్రైనేజీ డిజైన్‌లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఈ పరిస్థితికి ప్రధాన కారణం డబ్బులకు ఆశపడుతున్న గుత్తేదారుడేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పక్కనపెట్టి ఇష్టానుసారంగా రోడ్డు పనులు చేపడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాణ్యతలేని మెటీరియల్ వాడటం వల్ల తక్కువ కాలంలోనే రోడ్డు ధ్వంసమవుతోంది. డ్రైనేజీ బిళ్ళలు సరిగా బిగించకపోవడంతో అవి పగిలిపోతున్నాయి. ఇదంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పనుల పర్యవేక్షణ లోపించడంతో ప్రజల సొమ్ము నీటిపాలవుతోందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. కాగితాల మీద మాత్రమే నాణ్యత పరీక్షలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రౌండ్ లెవల్‌లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోడ్డుపై నీరు నిలిచిపోతే వాహనాలు ఆగిపోతున్నాయి. ఆ నీరు వెళ్లేందుకు కనీసం ఒక మార్గం కూడా లేకపోవడం దారుణం. పిల్లలు, వృద్ధులు ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అభివృద్ధి పేరుతో ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. తక్షణమే నాణ్యమైన పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను పునఃపరిశీలించిన శాస్త్రీయంగా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని తిలాపాపం తలా పిరికెడు అన్న చందంగా అధికారుల తీరు ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారా లేదా ప్రజల సొమ్ము ఇలాగే వరద నీటితో కలిసి కొట్టుకుపోతుందా అన్నది వేచి చూడాల్సిందే.

## హలో కామ్రేడ్.. ఛలో ఖమ్మం..

**18న ఖమ్మం లో జరిగే సిపిఐ శతాబ్ది సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో జనవరి 18న 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా కదలి రావాలని జూలూరుపాడు మండల కేంద్రంలో బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో నాడు స్వాతంత్రోద్యమం నుండి నేటి వరకు ప్రజల కోసం ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమని ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా ఈ ప్రాంతం నుంచి కదలి రావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఫాసిస్టు బీజేపీ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. భారతదేశంలో విభజించి పాలించే బిజెపిని ఓడించాలన్నారు. కమ్యూనిస్టులు ఎక్కడున్నారు అనే వారికి ఖమ్మం లో జరిగే భారీ బహిరంగ సభ ద్వారా ఈ పాలకులు కు బుద్ధి చెబుతామన్నారు. 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సిపిఐ ప్రతినిధులు వేలాదిగా తరలివస్తున్న ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఎర్ర చొక్కాలు ఎర్ర చీరలు ధరించి హాలో కామ్రేడ్ ఛలో ఖమ్మం పేరుతో వేలాదిగా కదలి వచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, ఎల్లంకి మధు గుడిమెట్ల సీతయ్య, కిలారి నరేష్, నరసింహారావు, వెంకటేష్, సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు తరలిరండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పీడిత, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. సత్తుపల్లిలో కార్మిక ప్రాంతాల్లో మంగళవారం జరిగిన సమావేశంలో దండు మాట్లాడుతూ సీపీఐ 100 సంవత్సరాల ఉత్సవాలు ఖమ్మంలో రంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే శతాబ్ది బహిరంగ సభకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, కష్టజీవులు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ సభకు 45 దేశాల ప్రతినిధులతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి నిమ్మటూరు రామకృష్ణ మండల కార్యదర్శి తడికమళ్ళ యోగు రామారావు ప్రసాద్ వెంకటేశ్వరరావు బ్రహ్మం మస్తాన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌తో ఆదాయం

**- క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** వాతావరణ కాలుష్య రహిత సోలార్ విద్యుత్‌తో ఆదాయాన్ని పొందవచ్చని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పాల్వంచ కో ఆపరేటివ్ మాజీ ఉపాధ్యక్షులు కాంపల్లి సోలార్ ఎనర్జి నూతన క్యాలెండర్‌ను బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జి వనమా వెంకటేశ్వరరావుతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ థర్మల్ విద్యుత్‌తో కాలుష్యం పెరుగుతుందన్నారు. ప్రభుత్వంపై భారం పడుతుందని అన్నారు.ప్రతీ ఇంటిపై సోలార్ అమర్చుకొంటే ప్రభుత్వం నుండి రూ.78/లు సబ్సిడీ వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దిండిగాల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, మల్లెల రవుచంద్ర, కొట్టి వెంకటేశ్వర్లు, వేల్పుల దామోదర్, లకావత్ గిరిబాబు, మంతపురి రాజుగౌడ్, బదావత్ శాంతి, కాపు క్రిష్ణ, సత్యనారాయణ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మూకమామిడి ప్రాజెక్ట్‌లో రొయ్య పిల్లలు విడుదల



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని మూకమామిడి గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఉన్న మూకమామిడి ప్రాజెక్ట్‌లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో 100శాతం సబ్సిడీతో మత్స్యకార సొసైటీ రైతులకు విడుదలైన లక్ష రొయ్య పిల్లలను మూకమామిడి గ్రామ పంచాయితీ సర్పంచ్ కొర్సా ఆదిలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం విడుదల చేవారు. ఈకార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారులు మీడియం మంగరాజు, కుంజ సూర్య ప్రకాష్, సంగ సభ్యులు కీసరి వెంకటేశ్వర్లు, కోర్సా నాగేశ్వరరావు, కీసరి రాములు, పైదా కోటేష్, రైతులు సున్నం వీరస్వామి, మడకం రాజులు, గడ్డం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బల్లాల వితరణ



**ప్రజాపక్షం/కారేపల్లి :** సింగరేణి మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయితీ సర్పంచ్ ఈసం మోతి వీరస్వామి, గ్రామస్తులు, బిజెపి వార్డు సభ్యులు తరపున గ్రామాలలో బల్లాలు వితరణగా వాళ్ల తల్లి దండ్రుల పేరు మీద పిట్టల కార్తీక్ చేశారు. గ్రామస్తులు ఈసందర్భంగా పిట్టల కార్తీక్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో కల్తీ రాంప్రసాద్, తురక నారాయణ, ఈసం భాస్కర్ బలపరచిన బిఆర్ఎస్ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సర్పంచ్ ఈసం మోతి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో రాజీలేదు..



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారానికి గ్రామ పంచాయితీ ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాదారం సర్పంచ్ ఉమా నరేష్ మాట్లాడుతూ మాదారం, గోవిందతండ గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎక్కడ రాజీ పడేది లేదని అవసరమైతే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు అందించడంలో రాజీ పడేదే లేదని తెలిపారు. అదే విధంగా ప్రతి నెలా గర్భిణీలకు అందించే పౌష్టికాహారం, టీకాలు దశలవారిగా అందజేసి వారి యొక్క ఆరోగ్య పరిస్థితి క్షణ్ణంగా పరీక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది కళావతి, కుమారి వెంకట్ లక్ష్మి, గ్రామ పెద్దలు పాపినేని సత్యనారాయణ, సైదయ్య, మాదారం కాంగ్రెస్ నాయకులు కోటేష్, తన్నీరు. వీరయ్య, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## గిరిజన మ్యూజియం ఆకట్టుకునేలా ఉంది

**- అస్ట్రేలియా దేశస్తురాలు రాబిన్ జెపరి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియం ఆకట్టుకనేలా ఉందని అస్ట్రేలియా దేశస్తులు రాలు రాబిన్ జెపరి అన్నారు. మంగళవారం మ్యూజియాన్ని సందర్శించేందుకు స్థానికులతో కలిసి వచ్చిన ఆమె మ్యూజియం ఏర్పాటును చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కట్టుబాట్లు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయని, మూజియం రూపకల్పన, అమరిక బాగుందన్నారు. ఇక్కడ అమరిక ఆచార వ్యవహారాలు ఇట్టే కనులను ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం నిర్వాహకులు వీరస్వాఇ, మాధవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 18న జరిగే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ బోనకల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా మంగళవారం బోనకల్ మండల కేంద్రంలో గాంధీ పదం కన్వీనర్ పాసంగుల కోటేశ్వరరావు,సిఐటియు నాయకులు బోయినపల్లి వీరబాబు లతో కలిసి ఎర్ర బెలూన్లను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 18న ఖమ్మం నగరం మొత్తం ఎరుపుమయం కానుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మండలాల నుండి భారతదేశంలో నలుమూల నుండి కమ్యూనిస్టు శ్రేణులు ఖమ్మం తరలి వస్తున్నారన్నారు. ఈ ప్రజలందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. 18న బహిరంగ సభ అనంతరం 19 నుండి 21 వరకు జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బోనకల్ మండల




కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు గూడా నర్సింహాశాస్త్రి, సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, యువజన నాయకులు గిరి, బసవయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ధి ఉత్సవాల సభ విజయవంతానికై విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/ బోనకల్ :** జనవరి 18న ఖమ్మంలో జరుగనున్న సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో బోనకల్ మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇంటింటికి తిరుగుతూ సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడుతూ భారత గడ్డపై సిపిఐ వందేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుని 101 సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలోని ఎస్ఆర్అండ్బిజెఎన్ఆర్ కళాశాల ఆవరణంలో జరుగనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ ఏర్పడిన వందేళ్లల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేసిందని, శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభలో దేశవిదేశాల నుండి ప్రతినిధులు, సిపిఐ



జాతీయ, రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్ధేశం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, మెకానిక్ సంఘం మండల నాయకులు సాంబత్తి వంశీ, ధనేకుల కోటి, చింతలచెర్వు కన్నయ్య పాల్గొన్నారు.

# సిపిఐ వంద వసంతాల బహిరంగ సభను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**




**ప్రజాపక్షం/కల్లూరు:** ఈ నెల 18వ తేదీ ఆదివారం ఖమ్మం లో జరిగే సిపిఐ 100 వసంతాల భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. కల్లూరు లో మీటింగ్ పోస్టర్ను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏర్పడి వందేళ్లు పూర్తి అయిందని ఈ వంద సంవత్సరాలు కాలంలో అనేక ఉద్యమాలకు పోరాటాలకు నాయకత్వం వహించి ఈ దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి ఈ దేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని పోరాడిన పార్టీ సిపిఐ అని అదే విధంగా రాజభరణాల రద్దు భూస్వామ్య వ్యవస్థ రద్దు బ్యాంకులు జాతీయకరణ కోసం అనేక పోరాట నిర్వహించిందని దున్నేవాడికి భూమి కావాలని నినదించి పోరాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలంగాణలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా జాకీర్దారులు జమీందారులు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి తెలంగాణలో 10 లక్షల ఎకరాలు భూములు పేదలకు పెంచి 4500 మంది కమ్యూనిస్టు వీరులు అమరత్వం చెందారని వారి బాటలోనే కమ్యూనిస్టు పార్టీ పయనిస్తుందని తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒలంపిస్తున్న ప్రజావ్యతిరేక, కార్మిక, వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, వెంకటేశ్వరరావు, భూషణం ప్రసాద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సంక్రాంతిని పురస్కరించుకుని ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ఖమ్మంజిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మంగళవారం ఖమ్మం అటవీ సముదాయ కార్యాలయం, పులిగుండ్ల పార్కులో ముగ్గుల పోటీలను నిర్వహించారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్, ఎఫ్‌డివో మంజుల పర్యవేక్షణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పలువురు ఉద్యోగినిలు పాల్గొన్నారు. వన్యప్రాణులు, వృక్షాల సంరక్షణ అనే ఇతివృత్తంతో మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. పులులు, పక్షులు, చెట్ల చిత్రాలను అందంగా చిత్రీకరించి పర్యావరణ సందేశాన్ని అందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ సాంప్రదాయ కళల ద్వారా ప్రజలకు పర్యావరణ బాధ్యతను గుర్తుచేయడం ఆనందంగా ఉందన్నారు. మన అడవులను, వన్యప్రాణులను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి వెలుగుమట్ల పార్కు, నీలాద్రి అర్బన్ పార్కు, పులిగుండ్ల పార్కులను సందర్శించి సంక్రాంతి కాటేజీలను అక్కడ కల్పించిన సౌకర్యాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా సంక్రాంతి కాటేజీలు...**

సంక్రాంతి పండుగ సందర్భంగా సత్తుపల్లి రేంజ్ పరిధిలోని నీలాద్రి అర్బన్ పార్కు, పులిగుండ్ల పార్కులలో అటవీ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండుగ వైభవాన్ని ప్రతిభింభించేలా సాంప్రదాయ గ్రామీణ వాతావరణానికి అనుగుణంగా సంక్రాంతి కాటేజీలను సందర్శకుల కోసం ఏర్పాటు చేశారు. గ్రామీణ సంస్కృతి, పండుగల ప్రాముఖ్యత, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటిచెప్పేవిధంగా ఏర్పాటు చేశారు.

# మున్సిపాలిటీలో అఖిలపక్ష సమావేశం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని మునిసిపాలిటీ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలు మౌలిక వసతులు ఓటర్ల జాబితా పై అఖిలపక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలు పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు తడకలు ఉన్నాయని ఫోటో ఒకటి పేరు ఒక రిది ఉన్నాయని ఈ విషయమై పార్టీల ప్రతినిధులు ప్రశ్నించారు. ఇప్పుడు ఏమి చేసేది లేదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీల ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే అచ్చట బిఎల్ఓలను అందుబాటులో ఉంచుతామని కమిషనర్ రామచంద్రరావు సమాధానం ఇచ్చారు. అసెంబ్లీ ఓటర్ల ఈ జాబితా ఉందని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయని మున్సిపాలిటీలో 20 వార్డులు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎన్నికలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేశ్వరరావు, పట్టణ ప్రణాళిక అధికారి భాస్కర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు, బి ఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులుగా చేరండి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాదారులుగా చేరి తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ సుబ్బారావు, ఫీల్డ్ ఆఫీసర్ గోపిచంద్ అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలు, ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకు సంబంధించి కళాకారులతో బ్యాంకు సేవలను వివరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులు చేరి తమ ఆర్థిక స్థితిగతులను మార్చుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాకారులు బ్యాంక్ స్కీమ్‌లపై కామెడీ జోక్స్‌లతో మ్యాజిక్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఓఎలు మేకల కృష్ణవేణి, గోపోజి ఉపేంద్ర, స్రవంతి, బ్యాంకు మిత్ర అనిత, జాల ఉమేష్, కళాబృందం సభ్యులు శ్రీనివాస్‌రాజ్, ఏడు కొండలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# బడి బస్సులను తనిఖీ చేసిన ఎంవిఐ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, బనిగండ్లపాడు, ఎర్రుపాలెంలోని ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సులను వైరా ఎంవిఐ కె.స్పార్టకస్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల యాజమాన్యం తప్పనిసరిగా బస్సుల్లో మెడికల్ కిట్లను కావాల్సిన మందులను ఏర్పాటు చేయాలన్నారు. దానితో పాటుగా బస్సు ఫుట్ బోర్ట్ తక్కువ ఎత్తులో ఉండే విధంగా చూడాలని, ఎమెర్జెన్సీ డోర్ ప్రతిరోజూ డ్రైవర్లు తీసి వేయడం చేయాలన్నారు. ముఖ్యంగా బస్సులు నడిపే సమయంలో డ్రైవర్లు తమ డ్రైవింగ్ లైసెన్స్ ఎల్లప్పుడు తమ వద్దనే ఉంచుకోవాలని సూచించారు. బస్సు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించవద్దని, ఫైర్ సేఫ్టీ సిలెండర్స్ బస్సులోనే గుర్తించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. బస్సు డ్రైవర్లు ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచి వారిని సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు. ఎర్రుపాలెం ఎస్‌జెకెఆర్ఎం కళాశాల బస్సులను పరిశీలించి కళాశాల ప్రిన్సిపల్ నాగిరెడ్డి సౌజన్యకు బస్సుల నిర్వహణ బాధ్యతలను వివరించి పలు సూచనలు చేశారు.

# క్రైస్తవులు ఆదర్శంగా జీవిస్తుండాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** క్రైస్తవులు సమాజంలో ఆదర్శంగా జీవిస్తూ ఉండాలని క్రైస్తవులను మత గురువులు రాజేంద్ర కోరారు. కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి మరియ తల్లి గ్రోటో వార్షికోత్సవంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ మతగురువులు పాల్గొనే ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఆయన ప్రత్యేకంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో బోధిస్తూ క్రైస్తవ సమాజం కలసివుంటే కలదు సుఖమని సమాజానికి అందరూ వెలుగై ఉన్నారని క్రైస్తవులందరూ దేవుని బాటలో నడిచినట్లయితే ఆధ్యాత్మికంగా ఆర్థికంగా బలపడతారని బోధించారు. గ్రామ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల ద్వారా గ్రామం శాంతి సమాధానం తో ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మత గురువులు వినయ్, అంతోని, నరేష్, లూర్దు, తోమస్, ఏసుబాబు తోపాటు పరిసర గ్రామ క్రైస్తవ సంఘాల సంఘ పెద్దలు, సంఘస్తులు, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీకేఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని తెల్దారుపల్లిలో కల్లుగీత కార్మిక సంఘం 2026క్యాలెండర్‌ను సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యా హాస్పిటల్ అధినేత డాక్టర్ నారగాని రాంప్రసాద్, సంఘం జిల్లా అధ్యక్షుడు బోడపట్ల సుదర్శన్, జిల్లా నాయకులు పామర్తి వాసు, మడిపల్లి వెంకన్న, నారగాని కృష్ణ, బోడపట్ల రాజేందర్, వెంకన్న, బాబు, కోటయ్య, సత్యనారాయణ, కృష్ణయ్య, నాగయ్య, వెంకట్‌రావు, కార్తీక్, సైదులు, రమేష్, శ్రీను, నగేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# హరిలో రంగ హరి.. హరిదాసుల గాన లహరి

- సంక్రాంతి సందడి చేస్తున్న హరిదాసులు
- ఇంటి లోగిళ్లలో నీతిగానం
- ఉట్టి పడే పల్లె జీవనం
- కలబోసిన సంప్రదాయ, సంస్కారం
- మారుతున్న హరిదాసులు జీవన చిత్రం





**ప్రజాపక్షం/భద్రాచలం :** హరిదాసులు ఆలపించే పాటల్లో భక్తి మాత్రమే కాదూ, తెలుగు సంస్కృతి,సంప్రదాయంతో పద్దతులు, కుటుంబ విలువలు, గౌరవాలు, నీతినియమాలు, కట్టుబాట్లు ఉట్టి పడుతుంటాయి. తంబుర మీటుతూ చిడతలు ఆడిస్తూ నెత్తిన అక్షయపాత్ర ఏ మాత్రం తొనక కుండా కాళ్లకు కట్టిన గజ్జెలతో అనుగుణంగా తాళం చేస్తూ చేసే గానలహరి ఎంతగానో ఆగట్టుకుంటుంది. రాళ్లను సైతం కదిలించే శక్తి కేవలం పాటకు మాత్రమే ఉంటుంది. అలాంటి పాటకు భక్తి భావం జతకడితే హత్తుకోని మనస్సు అంటూ ఉండదు. హరిదాసులు పల్లెల్లో చేసే సందడి పల్లె జీవనానికి అద్దం పడుతుంటాయి. తమ పాట ద్వారా సమాజాన్ని మేల్కొలిపే గొప్ప తనం హరిదాసులకే సొంతం.

### సంక్రాంతి సందడి...

హరిదాసుల గానాలు వినపించాయంటే చాలు సంక్రాంతి పొద్దు మెరుస్తుంటుంది. పాటలతో భావాలను వ్యక్తం చేస్తూ నీతిబోధనలు చేసే వారు ఇంటింటికీ తిరుగుతూ ఆశీర్వచనాలు అందిస్తుంటారు. ఈ పండుగ పూట పల్లెల్లోహరిదాసులకు ప్రత్యేక గౌరవం దక్కుతుంది. పంటలు ఇంటికి చేరి రైతులు ఆనందంగా ఉండే రోజుల్లో ఈ వేడుక రావడంతో హరిదాసులకు సంతోషంగా ధాన్యాన్ని అందిస్తుంటారు. సంక్రాంతి పండుగ పల్లె సంస్కృతికి ప్రతీకగా నిలవడంతో పాటు సాంప్రదాయ శోభను తెచ్చిపెడుతుంది.

### కలబోసిన సంస్కృతి సంప్రదాయం...

భక్తితో మేళవించిన సంస్కృతి సంప్రదాయాలు ఒక్క సంక్రాంతికే సొంతం. పాడిపంటలతో పచ్చగా ఉండే పల్లెలు సంప్రదాయాలకు, సంస్కృతికి పెట్టిన ఇళ్లుగా ఉంటాయి. సంక్రాంతి పర్వదినాల్లో ఇంటి లోగిళ్లలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, పండ్లు, ఫలాలు స్వాగతాన్ని పలుకుతుంటాయి. పల్లె నుండి పట్టణాలకు బ్రతుకు తెరువు కోసం వెళ్లిన కుటుంబాలు ఈ పండుగను పురస్కరించుకుని ఇంటి బాట పడతాయి. ఇలాంటి క్రమంలో హరిదాసుల గానాలను వినేందుకు ఉత్సాహాన్ని చూపుతుంటారు. పాటలు, రాగాలు, పద్యాలు అన్నీ నోటి మాట ద్వారానే నేర్చుకుని ప్రదర్శిస్తుంటారు. పట్టణాల నుండి పల్లెలకు వచ్చే పిల్లలను ఈ మౌఖిక సంప్రదాయం మరింతగా ఆకట్టుకుంటుంది. భక్తితో మేళవించిన సంస్కృతి సందేశాత్మకంగా సాగుతుంది.

### మారుతున్న పరిస్థితులు...

పల్లెల నుండి పట్టణాలకు వలసలు పెరిగిపోవడంతో జీవిన ప్రమాణాల నేపథ్యంలో హరిదాసులు కూడా మారిపోతున్నారు. ఒకప్పుడు పల్లెల్లో ఘనంగా వినిపించే గానాలు క్రమక్రమంగా మూగబోతున్నాయి. వారసత్వంగా వచ్చే ఈ వృత్తి వైపు తర్వాతి తరం ఆసక్తి చూపడం లేదు. అయినప్పటికీ వారి పాటల్లో ఉండే సందేశం ఎప్పటికీ సజీవమే.

# స్వీయ క్రమశిక్షణతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

- ఎస్‌పి రోహిత్ రాజ్
- 10 రోజుల పాటు రోడ్డు భద్రతపై అవగాహన



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** రోడు ప్రమాదాల నివారణకు స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్‌లో పోలీస్, రవాణా, ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు స్వీయ రక్షణ ద్వారా రోడ్డు ప్రమాదాల భారిన పడకుండా ఉండొచ్చన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించడం ఎంతో ముఖ్యమని, వాహనాలు నడిపే సమయంలో నియమాలు ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. ఇలా పాటించడం ద్వారా మన ప్రణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా రక్షణ కల్పించినట్లు అవుతుందని చెప్పారు. వేగంగా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడపడం, సిగ్నల్ దాటి వెళ్లిపోవడం, అధిక లోడ్‌తో వెళ్లడం వల్ల అనే నష్టాలు ఉంటాయని, ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగినప్పుడు విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు ప్రమాద నియమాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రెహమాన్, ట్రైనీ ఆర్‌డిఓ మురళీ, జిల్లా రవాణాధికారి భూషితారెడ్డి, ఆర్‌టిసి డిఎం రాజ్యలక్ష్మి , తహశిల్దార్ కృష్ణ, మోటార్ వాహనాల అధికారి వెంకట రమణ, వెంకట పుల్లయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిఐలు ప్రతాప్,శ్రీ లక్ష్మి , వెంకటేశ్వర్లు, సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి, ఎస్‌ఐలు రమణారెడ్డి, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మనుగడకు పీకేఓసి2 డిప్ సైడ్ బ్లాక్ అత్యంత ముఖ్యమైంది



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో మణుగూరు కేసిహె పి నందు ఫిట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ మిర్యాల రంగయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థకు మణుగూరు ఏరియా మనుగడకు పీకేఓసి2 డిప్ సైడ్ బ్లాక్ అత్యంత ముఖ్యమైనదని అన్నారు. ఈ డిప్ సైడ్ బ్లాక్ ను కేంద్ర ప్రభుత్వం వేలం పాటలో పెట్టిందని ఈ యొక్క వేలా నికి ఆదాని ఏఎంఆర్ మెగా కృష్ణారెడ్డి తదితర ఏడు సంస్థలు టెండర్లు వేయడానికి సిద్ధపడ్డాయని, ఈ తరుణంలో బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘంగా గోదావరిఖని, కొత్తగూడెం కార్పొరేట్ లో ప్రెస్ మీట్లు పెట్టి అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సింగరేణి సంస్థ డైరెక్టర్ ని కలిసి సింగరేణికే మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కేలా చూడాలని మేనేజ్మెంట్ పై ఒత్తిడి తెచ్చి ఒప్పించడం జరిగిందని అన్నారు. సింగరేణిలో ఏఐటియుసి కార్మిక సంఘంల ఒత్తిడికి ప్రైవేటు సంస్థలు టెండర్లు వేయలేదని ఇది ముమ్మాటికి కార్మికుల విజయమని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వేలమంది అమరులయ్యారని అన్నారు. దేశ విదేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని కావున అందరూ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోని అన్ని కార్మిక సంఘాలు కలిసి ఫిబ్రవరి 12న ఈ నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చాయని అన్నారు. ఈ దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రాంనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, పిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి రవికుమార్, గుంపెన పల్లి శ్రీనివాసరావు, శివకుమార్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు రాజేందర్, డివి రావు, నాగుల సతీష్, వలి, గౌస్ పాషా, వెంకటేశ్వర్లు, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# పురాతన వస్తువులను పరిశీలించిన ఏడీ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద జరుగుతున్న పనులలో భాగంగా లభించిన అతి పురాతన వస్తువులను పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.బుజ్జి మంగళవారం పరిశీలించారు. ఇటీవల బయటపడ్డ వస్తువులను పరిశీలించారు. వీటి యొక్క విశిష్టత గురించి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బౌద్ధక్షేత్రం వద్ద జరుగుతున్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక్కడ బయటపడ్డ వస్తువులను భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి డా. తుకారామ్ రాథోడ్ అన్నారు. మంగళవారం దుమ్ముగూడెం మండల పరిధిలోని పర్ణశాల, దుమ్ముగూడెం ప్రాథమి ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి తుకారామ్ రాథోడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించిన ఆయన సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందంచాలని సూచించారు. ఆపరేషన్ థియోటర్, రక్తపరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆయన ఆపరేషన్ థియోటర్లలోకి అసరమైన అత్యవసర మందులను ఆదుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ల్యాబ్‌లలో పరీక్షలు చేసే సిబ్బంది నిర్ధిష్టిమైన నిబంధనలు అనుసరించి రిపోర్టులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రుల వైద్యులు, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు పలు రంగాల్లో నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ కే వెంకటరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుండి 35 సం.లు కలిగిన యువతీ యువకులు ఈ ఉచిత శిక్షణకు అర్హులన్నారు. సర్వేయర్, కనస్ట్రక్షన్, ఎలక్ట్రీషన్, ప్లంబర్ జనరల్, పెయింటర్, డెకరేటర్ వంటి వాటిపై 90 రోజుల పాటు శిక్షణను అందించి నూటికి నూరు శాతం ఉపాధి కల్పిస్తామన్నారు. సర్వేయర్‌కు ఇంటర్ పాస్, ఐటిఐ పాసై ఉండాలని, కనస్ట్రక్షన్, ఎలక్ట్రీషన్‌కు పదో తరగతి ఆ పైన, మిగతా వాటికి 7వ తరగతి ఆ పై చదువులున్న వారు అర్హులని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత యూనిఫాం, షూ, హెల్మెట్, స్టేషనరీ ఇస్తారని, శిక్షణ అనంతరం న్యాక్ సర్టిఫికెట్ ఇస్తారని, ఉచిత భోజనంతో పాటు హాస్టర్ సదుపాయం ఉంటుందని చెప్పారు. అదే విధంగా గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు చేసుకునేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్ ట్రైనింగ్ కూడా ఇస్తారని, పూర్తి వివరాల కోసం యూత్ ట్రైనింగ్ సెంటర్, కొత్తగూడెం రోడ్, సుదిమళ్ల, ఇల్లెందు, 9849248650,9807467 4319 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల వారు ఈనెల 9వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# లబ్ధిదారులకు డిప్యూటీ సీఎం లేఖలు



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రభుత్వం ద్వారా ఉచిత విద్యుత్ సదుపాయం పొందుతున్న లబ్ధిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నూతన సంవత్సర, సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ పంపిన సందేశ లేఖలను విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారు. మణుగూరు మండలం గుట్ట మల్లారం గ్రామ పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినియోగదారుడి పేరు, సర్వీస్ కనెక్షన్ నంబర్‌తో కూడిన వ్యక్తిగత లేఖలను ప్రతి ఇంటికీ తిరిగి అందజేస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతున్న లబ్ధిదారులు, అలాగే వ్యవసాయ విద్యుత్ వినియోగదారులందరికీ ఈ లేఖలను అందజేస్తామని విద్యుత్ సంస్థలు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించాయి. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారులువిద్యుత్ అధికారుల మధ్య మరింత అనుసంధానం ఏర్పడి, భవిష్యత్తులో సేవలు పారదర్శకంగా, వేగంగా అందించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ అశోక్, విద్యుత్ సిబ్బంది సాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన బిటిపిఎస్ ప్లాంట్ అధికారులు



**ప్రజాపక్షం/మణుగూరు:** బిటిపిఎస్ ప్లాంట్‌కు చెందిన ప్రసాద్ (సివిల్2), దాస్ ప్రజా భవన్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసేవకు సంబంధించిన అంశాలపై సానుకూల చర్చ జరిగింది. ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే నాయకత్వాన్ని వారు ప్రశంసించారు.

# దారి పంచాయతీలో కుటుంబంపై దాడి

-ముగ్గురికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఓ దారి పంచాయతీలో కుటుంబం పై దాడి చేసిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. బాధితులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని చెన్నారం గ్రామానికి చెందిన జోగుపర్తి నాగేశ్వరరావు కు మంద్రాజుపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన రైతుల మధ్య వ్యవసాయ పొలాలకు వద్ద దారి పంచాయతీ నడుస్తుంది. ఈ క్రమంలో మంగళవారం నాగేశ్వరరావు కోడలు అనూష, అత్త లక్ష్మి మనవరాలు చరణ్య (10) వారు పొలం వద్ద కు వెళ్లి వస్తుండుగా మంద్రాజుపల్లి కొత్తూరు కు చెందిన శ్రీనివాసరావు తో పాటు కొంత మంది అడ్డగించి మూకుమ్మడి దాడి చేశారని బాధితులు తెలిపారు. అంతే కాకుండా జెసీబీ తో దాడి చేసేందుకు ప్రయత్నించారని వాపోయారు. అదే విధంగా కుటుంబం దాడి చేసేందుకు ఇతరప్రాంతాల నుంచి మరి కొంత మందిని తీసుకొచ్చి, దాడి చేస్తుండుగా, చెన్నారం గ్రామస్తులు గమనించి ఘటనా స్థలం వద్ద కు వస్తుండుగా గమనించి ప్రత్యేక వాహనాలలో పారిపోయారని బాధితులు పేర్కొన్నారు. తమ కుటుంబ పై దాడి చేసిన వారి పై సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని బాధితులు అనూష స్థానిక పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దాడిలో గాయపడ్డ ముగ్గురు స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో ప్రధమ చికిత్స చేయించారు.

# సిపిఐ వందేళ్ల ముగింపు సభను జయప్రదం చేయండి

## సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రా బాబు

**ప్రజాపక్షం/వైరా:** ఈ నెల18న ఖమ్మంలో ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఎఆర్ కాలేజీ గ్రౌండ్ నందు సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలకు అధిక సంఖ్యలో ఖమ్మంకు తరలిరావాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రా బాబు అన్నారు. సోమవారం వైరా మండల కార్యాలయంలో వైరా మండల కౌన్సిలర్ సమావేశం మండల కార్యదర్శి యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్ర బాబు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పుటిట100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైరా నుండి రాజకీయ మేధావులు కమ్యూనిస్టు పార్టీ సభ్యులు అభ్యుదయవాదులు పేరు పేరునా తరలిరావాలని కదిలించాలని ఖమ్మంలో జరిగే భారీ ర్యాలీలో బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యామాల గపాలరావు, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, ఏఐటియుసి మండల కార్యదర్శి గారపాటి అశోక్, రాయపూడి శ్రీను, రాకేష్‌రెడ్డి, కంచర్ల కృష్ణ, మూటా కొండా, రాంబాబు, ముత్తయ్య, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో పోలింగ్ కేంద్రాలు చేర్పులు, మార్పులపై మున్సిపాల్ కమీషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పట్టణ నాయకులు కొంగర సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వైరా మున్సిపాలిటీలోని 20 వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించారు. అందులో 5,6,9 వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు ప్రజలకు దూరంగా ఉండేలా ప్రతిపాదించబడినట్లు గుర్తించి అలా చేస్తే ఓటర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి 5,6 వార్డుల పరిధిలో సుందరయ్యనగర్, ఇందిరమ్మ కాలనీ, రాజశేఖర్‌నగర్ ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉండేవిధంగా అక్కడే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేని చోట, ప్రభుత్వ అనుమతి పొందిన ప్రైవేటు విద్యాసంస్థల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. సిపిఎంప్రతిపాదనలపై స్పందించిన మున్సిపాల్ కమీషనర్ గురులింగం మాట్లాడుతూ 5,6 వార్డుల పోలింగ్ కేంద్రాల విషయాన్ని ఎన్నికల కమీషన్, జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించి, పోలింగ్ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీ లనాయకులు, మున్సిపాల్ అధికారులు పాల్గొన్నారు.



# సాధారణ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** సాధారణ వ్యాధులైన షుగర్, బిపి తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వరరావు, డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. మంగళవారం బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శ్రీ కృష్ణం రాజు మెమోరియల్ యునైటెడ్ కింగ్డమ్ ఇండియా డయాబెటిక్ ఫుడ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జనవరి 20వ తేదీన మధిర పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ నందు సాధారణ వ్యాధులపై వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు, ఈశిబిరంలో ఉచిత స్క్రినింగ్ పరీక్షలు, డయాబెటిక్ ఫుడ్ కేర్‌పై అవగాహన, అవసరమైన వారికి డాప్లర్ టెస్ట్, మందులు పంపిణీ చేయనున్నట్లు, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్వైజర్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి

**ప్రజాపక్షం/వైరా:** ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడి మన వంతు ఆర్థిక చేయూత అందించాలని డాక్యుమెంట్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు ఏనుగు హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా బోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఎంతో మంది వివిధ కారణాల ద్వారా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, చదువుకునే నాలెడ్జ్ ఉండి ఆర్థిక స్థోమత లేక ఎంతోమంది విద్యార్థులు వెనుకబడుతున్నారని, అలాంటి వారికి మనవంతు చేతనైనంత ఆర్థిక సాయం అందించి వారికి అండగా నిలబడితే వారి భవిష్యత్తు మంచిగా ఉంటుందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారని డాక్యుమెంట రైటర్ ఏనుగు హనుమంతరావు తెలిపారు.



# 28న కోదండరాం పర్యటనను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఈ నెల 28న తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ కోదండరామ్ పర్యటన ను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఉద్యమకారుల పై చూపిన శ్రద్ధ ప్రస్తుతం చూడకపోవటం దారుణం అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని క్షేత్ర స్థాయిలో ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈ నెల 28 న నేలకొండపల్లి లో టీజెఎస్ జిల్లా జనరల్ బాడీ, సమావేశం ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశం కు కోదండరామ్ తో పాటు, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశం కు కోదండరామ్ తో పాటు, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. నూతన కమిటీలు ఏర్పాటు చేయటం తో పాటు, భవిష్యత్ కార్యాచరణ ను ప్రకటిస్తారని తెలిపారు. కావునా కార్యకర్తలు, ఉద్యమకారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, రాజేందర్ నాయక్, తీగ రాములు, వెంకటేశ్వరరావు, బెల్లంకొండ నాగేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

## సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామపంచాయతీ పరిధిలోని జింకలగూడెం గ్రామంలో 9వ వార్డులో షేక్ మస్తాన్ ఇంటి వద్ద నుంచి షేక్ అబ్దుల్ రెహమాన్ ఇంటి వరకు నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డుకు మంగళవారం తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు, ఉప సర్పంచ్ షేక్ ఇస్మాయిల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సమీముల్లా, షేక్ మహ్మద్ మీరా, షేక్ హజ్రత్‌అలి, సైదా, హుస్సేన్, పుల్లు సాహెబ్, తాతా నిర్మల, దుగ్గిరాల శ్రీనివాసరావు, జవ్వాజి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు గాంధీచౌక్‌లో భోగి మంటలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాత సెంటర్ గాంధిచౌక్‌లో బోగి, సంక్రాంతి సందర్భంగా కాంగ్రెస్ యువ నాయకుడు కొప్పురావూరి శబరినాథ్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు బోగి మంటల కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ బోగి మంటల కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని కొప్పురావూరి శబరినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా శబరినాథ్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు తెలిపే విధంగా ప్రతిఒక్కరూ ఎంతో ఆనందంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుపుకునే సంక్రాంతి పండుగ సందర్భంగా బోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ బోగి మంటల కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

# సంతోషంగా సంక్రాంతి జరుపుకోవాలి

**ప్రజాపక్షం/వైరా:** సంక్రాంతి పండుగను ఆనందాలతో సంతోషంగా కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని వైరా ము న్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు పట్టణ కాంగ్రెస్ నాయకులు ఫనితి సైదులు, ఉషా దంపతులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పర్వదినాల సందర్భంగా ముందుగా బోగి శుభాకాంక్షలు. అదేవిధంగా సంక్రాం తి శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు. పండుగ వేల కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని, వాహనాలపై వెళ్లేటప్పుడు అతివేగం వద్దు కుటుంబం ముద్దు అని వారు అన్నారు. ఈ పండుగ ప్రతి కుటుంబంలో సంతోషంతో పాటు సౌభాగ్యాలు కూడా కలిసి రావాలని వారు కోరారు.




# వల్లాపురంలో యూరియా కూపన్లు పంపిణీ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం వల్లాపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో జరిగిన యూరియా కూపన్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ మన్నెం హనుమంతరావు రైతులకు కూపన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మన్నెం హనుమంతరావు మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా కొరత లేదని అందరికి యూరియా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారాయణ, ఏఈవో వాసంతి తదితరులు పాల్గొన్నారు.



# సిపిఎం నేత కట్టా గాంధీకి నివాళి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని పోచవరం గ్రామంలో సిపిఎం పార్టీ నేత కట్ట గాంధీ (78) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. అతనికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కార్మికుల కర్షకుల పేద ప్రజల కోసం జీవితాన్ని అర్పించిన వ్యక్తిని అనేక ఉద్యమాలకు అంకితభావంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించిన వ్యక్తి అని 60 ఏళ్ళు రాజకీయం చేసి ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేశాడని అన్నారు. సమస్యలు పరిష్కారంలో ముందున్నారని వారు పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, కళ్యాణ వెంకటేశ్వరరావు జిల్లా నాయకు లు బండి పద్మ, మడుపల్లి గోపాలరావు, తాత భాస్కరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, సాను భూతిపరులు, కాంగ్రెస్, బిఆర్ఎస్ మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, నాయకులు కట్ట గాంధీ భౌతిక దేహమును సందర్శించి నివాళులర్పించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతూ కోటా దర్గయ్య మరణించిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఫణితి సైదులు వారి ఇంటికెళ్లి వారి కుటుంబానికి రూ.10వేలను అందజేశారు. అనంతరం దుర్గయ్య కుమారులకు అండగా ఉంటామని సైదులు తెలిపారు. ఫణితి సైదులుతో పాటు పోటు మధు, తాండ్ర శ్రీను, గిరి తదితరులు ఉన్నారు.

